## ఆర్టీసీ కార్మికుల ముందస్తు అరెస్టు

### 'సమ్మె సమరభేరి'కి వెళ్లకుండా అడ్డుకున్న మధిర పోలీసులు


అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మధిర, ఏప్రిల్ 7: టీజీఎస్ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు సమ్మె సమరభేరి కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ జేఏసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముద్దిశెట్టి రామచంద్రరావు, ఈయూ మధిర డిపో కార్యదర్శి షేక్ నాగుల్ మీరాలను మధిర పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి తిమ్మినేని రామారావు, రామచంద్రరావు, నాగుల్‌మీరా మాట్లాడుతూ జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న తమను అరెస్టు చేయడం ఏమిటని, ప్రజా పాలన అంటే ముందస్తు అరెస్టులా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 15 నెలలు గడిచినా అతీగతీ లేదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా పని ఒత్తిడితో సిబ్బంది అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ పనిభారాన్ని వెంటనే తగ్గించాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు.

## ఎప్‌సెట్ కోచింగ్ సెంటర్‌ను సందర్శించిన శ్రీజ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 7 : ఖమ్మం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఎంపిక చేసిన 50మంది విద్యార్థులకు కల్పిస్తున్న ఉచిత ఎప్‌సెట్ శిక్షణను అదనపు కలెక్టర్ పీ శ్రీజ సోమవారం సందర్శించారు. బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే తన కుటుంబంతోపాటు సమాజం కూడా బాగుంటుందని, ఆ దిశగా ప్రతిఒక్కరూ కష్టపడి మంచి ఫలితాలను సాధించాలన్నారు. డీఐఈవో రవిబాబు, కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సన్మానం

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 7 : తెలంగాణ శాసనమండలిలో పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి మధు, కందుల వెంకటనర్సయ్య, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

## రీవాల్యుయేషన్ గడువు పొడిగించాలి

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 7 : ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో మూడు, ఐదో సెమిస్టర్ రీవాల్యుయేషన్ తేదీలను పొడిగించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రిన్సిపాల్ జాకీరుల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేష్, శ్రీకాంత్, వరుణ్, నిఖిల్ పాల్గొన్నారు.

## రేపు నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

మామిళ్లగూడెం, ఏప్రిల్ 7 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటురంగం అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 9వ తేదీ బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి మాధవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 10గంటల వరకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కే రన్

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సత్తుపల్లి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన రహదారి మీదుగా పాతసెంటర్ రింగ్ రోడ్డు వరకు ఈ 2కే రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి వైద్యులు డాక్టర్ శివాజీ, రామ్‌హరీష్, లయన్స్ క్లబ్ బాధ్యులు దొడ్డ కృష్ణయ్య, గోపాలరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

## ఉపవాస దీక్ష ప్రార్థనలు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 7: మండలంలోని వెంకటాపురం ఆర్‌సీఎం చర్చిలో ఎర్రుపాలెం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నారపోగు ఏసు ఆధ్వర్యంలో సోమవారం ఉపవాస దీక్షలు నిర్వహించారు. ఖమ్మం బిషప్ షకిలిప్రకాశ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రేమానురాగాలతో మెలగాలని, క్రైస్తవ బిడ్డలు పేదలకు దానధర్మాలు చేయాలని, భక్తిశ్రద్ధలతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫాదర్ కొప్పుల శౌరీ, ఫాదర్ బట్ట ఏసు, ఫాదర్ తుడుం విజయ్, ఫారద్ విన్సెంట్, ఫాదర్ సుగుణరావు పాల్గొన్నారు.

## మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలి

కూసుమంచి(నేలకొండపల్లి), ఏప్రిల్ 7: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు ధాన్యం అమ్ముకోవాలని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు అన్నారు. మండలంలోని ఆరెగూడెంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ రైతు సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపి, ఇన్‌చార్జి నవీన్, సుజాత, మేనేజర్ సందీప్, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

బోనకల్లు, ఏప్రిల్ 7: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఏఎంవో రవికుమార్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఏఎంఓ రవికుమార్, తహసీల్దార్ అనిశెట్టి పున్నచందర్, ఎంఈవో దామాల పుల్లయ్యతో కలిసి సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

## ప్రజా ఉద్యమాలను ఆపలేరు : భూక్యా వీరభద్రం

వైరాటౌన్, ఏప్రిల్ 7: చలో గిరిజన సంక్షేమ భవన్ హైదరాబాద్ ముట్టడి పిలుపులో భాగంగా వైరా పోలీసులు ముందస్తుగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, 'సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రంను సోమవారం తెల్లవారుజామున పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భూక్యా వీరభద్రం అక్రమ అరెస్టును సీపీఎం నాయకులు ఖండించారు.

## కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

వైరాటౌన్, ఏప్రిల్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని దాచాపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు శీలం వెంకటనర్సిరెడ్డి, అయిలూరి కృష్ణారెడ్డి, మంజుఖాన్, సంపత్, సైదులు, శీలం నాగిరెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, ముక్కర వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# వైద్యసిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


పెనుబల్లి: లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెనుబల్లి, ఏప్రిల్ 7: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల సేవా దృక్పథంతో పనిచేసి ప్రభుత్వ వైద్యసేవల పట్ల విశ్వాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని లంకాసాగర్ గ్రామంలోగల పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రిలో మందుల నిల్వలు, సాధారణ ప్రాథమిక వైద్యసేవలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ల్యాబ్, ఆసుపత్రి నిర్వహణ, తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ప్రవర్తన విధానం మెరుగ్గా ఉండాలని, మనం ప్రజలకు సేవ చేయడం కోసం ఉన్నామనే ఆలోచనా విధానంతో పనిచేయాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడానికి వీలు లేదన్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల గురించి, ఎన్ని సాధారణ, సీజేరియన్ ఆపరేషన్లను చేసింది అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని, మొదటి నుంచే గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా మందుల కొరత ఉండటానికి వీల్లేదన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, వేంసూరు తహసీల్దార్ గంటా ప్రతాప్, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, పూలమ్మ, సుగుణదేవి, వాసు, నిర్మలకుమారి, కృష్ణవేణి, శ్రీను పాల్గొన్నారు.

**పంటకు లాభాలు పెంచడమే లక్ష్యం: కలెక్టర్**

పెనుబల్లి, ఏప్రిల్ 7: రైతులకు ఎలాంటి వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఇబ్బంది కలుగకుండా పంటకు లాభాలు పెంచడమే లక్ష్యంగా యంత్రాంగం సమన్వయంతో ముందస్తు కార్యచరణ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని అడవిమల్లెల గ్రామంలోని లంకాసాగర్ చిన్నతరహా ప్రాజెక్టును రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు. లంకాసాగర్ ప్రాజెక్టు కట్టపై కలెక్టర్ బైక్‌పై ప్రయాణించి క్షేత్రస్థాయిలో నీటి లెవల్స్‌ను పర్యవేక్షించారు. ప్రాజెక్టు కట్టిన తర్వాత ఇంత వరకు షీల్డ్ తొలగించలేదని, షీల్డ్ తొలగిస్తే వాటర్ స్టోరేజి పెరుగుతుందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. లంకాసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదనలు తనకు పంపాలని, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పంట మార్పిడి పద్ధతిని అలవర్చుకోవాలని, లాభాలు వచ్చే పంటలపై దృష్టిసారించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి**

వైరాటౌన్, ఏప్రిల్ 7: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. వైరాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసరావు, హెచ్ఎం, పంచాయతీరాజ్ ఇంజినీర్స్ పాల్గొన్నారు.

**విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించాలి**

మామిళ్లగూడెం, ఏప్రిల్ 7: విద్యార్థులకు 8వ తరగతి నుంచే కెరియర్ గైడెన్స్ అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి లైబ్రెరీ, రీడింగ్ రూమ్స్, మా పాప- మా ఇంటి మణిదీపం, సన్నబియ్యం తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలకు కెరియర్ గైడెన్స్ అందించేందుకు ప్రతి మూడునెలలకు ఒకసారి మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రారంభించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం


సత్తుపల్లి టౌన్: కల్యాణం నిర్వహిస్తున్న రామకృష్ణ

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్7: మండలంలోని రేజర్ల గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ శ్రీరామచంద్రస్వామికి పట్టాభిషేకం సోమవారం నిర్వహిచారు. వెండి కిరీటం, వెండి ఖడ్గం, వెండి పాదుక, వెండి రాజముద్రిక, వెండి రాజదండం తదితర వివిధ ఆభరణాలతో శ్రీరామచంద్రస్వామిని అలంకరించి పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

**ముత్తారంలో..**


ముదిగొండ: పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ, ఏప్రిల్ 7: మండలంలోని ముత్తారంలో రాముల వారి పట్టాభిషేకం సోమవారం నిర్వహించారు. వేద పండితులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యుల, శిష్య బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణ నడుమ క్రతువును నిర్వహించారు. తొలుత కళశాలు, ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేసి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం రాజదండం, రాజ ముద్రిక, రాజఖడ్గం, చంత్రం, చామరలు స్వామికి అలంకరించి కిరీటధారణ చేసి పట్టాభిషేక క్రతువు ముగించారు.

## రేపు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

రఘునాథపాలెం, ఏప్రిల్ 7 : సీపీఎం నేత యర్రా శ్రీకాంత్ మృతి పట్ల కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు గ్రేడ్-1 కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు. 10వ తేదీన తిరిగి మార్కెట్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పునఃప్రారంభం అవుతాయన్నారు.

## యర్రా శ్రీకాంత్‌కు పలువురి నివాళి


యర్రా శ్రీకాంత్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం కమాన్‌బజార్, ఏప్రిల్ 7 : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్ భౌతికకాయం సోమవారం ఖమ్మం చేరుకుంది. నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పలువురి సందర్శన కోసం ఉంచారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతోపాటు ఖమ్మం నగర మేయర్ నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు శ్రీకాంత్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ శ్రీకాంత్ మరణం ప్రజలందరికీ తీరని లోటన్నారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్‌కుమార్, కేవీ కృష్ణారావు, పసుపులేటి నరసయ్య, మాక్బుల్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఆర్‌జేడీ


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

కొణిజర్ల, ఏప్రిల్ 7: కొణిజర్ల సెక్టార్ పరిధిలోని కొణిజర్ల - 2, 4 అంగన్‌వాడీ కేంద్రాలను వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) ఝాన్సీలక్ష్మీబాయి సోమవారం సందర్శించారు. పిల్లల బరువులు, ఎత్తులు పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు ఉన్నట్లయితే గృహ సందర్శణాలు చేసి తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చి లోప పోషణ తగ్గించాలన్నారు. ఆమె వెంట సీడీపీవో సీ.హెచ్.కమలప్రియ, పోషణ అభియాన్ డీసీ కొమ్మినేని బాబు, షామిలి, సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు ఉన్నారు.

## ఫిజియోథెరపి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధిర(చింతకాని), ఏప్రిల్ 7: శారీరక దివ్యాంగ చిన్నారులకు ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహించే ఫిజియోథెరపి ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సలాది రామారావు అన్నారు. సోమవారం చింతకాని మండలంలోని పలుగ్రామాల్లో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మండలం లచ్చగూడెం హైస్కూల్ ప్రాంగణంలో దివ్యాంగ బాలికల భవితా కేంద్రం సేవలందిస్తుందన్నారు. వివరాలకు 6302504078, 9492244874, 9701611706 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముదిగొండ, ఏప్రిల్ 7: మండలంలోని మేడేపల్లి, కట్టకూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సునీత ఎల్జెబిత్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మొద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 7: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామివారికి ప్రాతఃకాల అర్చనల అనంతరం యజ్ఞశాలలో నిత్య అనుష్టానములు, హోమాలు, అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. గత 9 రోజులుగా విశేష పూజలు అందుకున్న శ్రీఅలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి యజ్ఞేశ్వరస్వామి ప్రీత్యర్థం వేదమంత్రోచ్చారణలతో మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ధ్వజ అరోహణ, గరుడ స్వామికి షోడో షోపచారపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షణ అధికారి కే.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్‌సెంటర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి

మధిర, ఏప్రిల్ 7: పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని మిరియాల కాశయ్య, కోమటిడి శ్రీనివాసరావులు సోమవారం తహసీల్దార్ రాంబాబు, కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్సుషెల్టర్ లేక ఎండలోనే ఉంటున్నారన్నారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

## ఎర్రగడ్డ పంచాయతీని సందర్శించిన డీఎల్‌పీవో


రికార్డులు తనిఖీచేస్తున్న డీఎల్‌పీవో

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 7: మండలంలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీని మంగళవారం డీఎల్‌పీవో రాంబాబు సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఇంటి పన్నులు, నగదు రశీదు, గ్రామ సభ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ నర్సరీ, సేంద్రీయ ఎరువుల కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

## ఆకమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 7: మండలంలోని కాకరవాయిలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ గ్రామ కంఠం భూములను కాపాడాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో తహసీల్దారు సుధీర్, ఎంపీడీవో సీలార్ సాహెబ్‌కు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తపల్లి శివయ్య, చంటి, తిమ్మిడి రఘుబాబు పాల్గొన్నారు.

## పీఎం యశస్వి స్కాలర్‌షిప్‌కు టాలెంట్ స్కూల్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం 8వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 9వ తరగతిలో అందజేసే ప్రధానమంత్రి యశస్వి స్కాలర్‌షిప్‌కు స్థానిక టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి 9వ తరగతిలో రూ.27,500 చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులు దండమూడి లక్ష్మీదుర్గ, జలదాని తన్మయిశ్రీజ, షేక్ పర్వీన్, గుర్రాల దీపికసాయి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 7: కల్లాలో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారం క్రితం సొసైటీ ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశారని, కానీ వారంరోజుల నుంచి రైతుల వద్ద ఒక బస్తా కూడా కొనలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని కొనుగోలు చేయాలని కోరారు.

## 19 నుంచి మల్టీపర్పస్ వర్కర్ల సమ్మె

బోనకల్లు, ఏప్రిల్ 7: ఈ నెల 19 నుంచి మల్టీపర్పస్ వర్కర్లు సమ్మెకు దిగుతున్నట్లు మల్టీపర్పస్ వర్కర్ల జిల్లా నాయకుడు మరీదు పుల్లయ్య తెలిపారు. సోమవారం ప్రజావాణిలో సమస్యలపై వినతిపత్రాన్ని ఎంపీడీవో ఆర్.రమాదేవికి మల్టీపర్పస్ వర్కర్లు అందజేశారు. కార్యక్రమంలో అంతోటి రమేశ్, బోయిన సుధాకర్, షేక్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## 19 నుంచి పంచాయితీ వర్కర్ల సమ్మె

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 7: ఈ నెల19వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపు నిచ్చినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ల పల్లి మోహన్‌రావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సంఘం నాయకులతో కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు లాలయ్య, ధర్మేంద్ర, ఉపేందర్, రామారావు, మేనేష్, వీరబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కాంపౌండర్లను రెగ్యులర్ చేయాలి

మధిర, ఏప్రిల్ 7: ఆయూష్‌శాఖలో 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న కాంపౌండర్‌లను రెగ్యులర్ చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆయూష్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల రాంబాబు కోరారు. సోమవారం మధిరలో ఆయన విలేకర్ల మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి 28న విడుదల చేసిన 65 జీవోను సవరించాలని, ఈ జీవో గుదిబండగా మారిందన్నారు. ఈ జీవోను 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఆయూష్ కాంట్రాక్ట్ కాంపౌండర్లకు వర్తింప చేయాలని చెప్పడం ప్రభుత్వ ఉద్యోగ సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకమన్నారు.

## ఆస్పత్రి నిర్మాణానికి స్థలం దానం

మధిర, ఏప్రిల్ 7: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన విశ్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ పుతుంబాక సుభాశ్ తల్లిదండ్రులు పుతుంబాక రామ సీతమ్మ పేరు మీద ఉన్న 5 సెంట్ల స్థలాన్ని ఆసుపత్రి నిర్మాణానికి దానంగా ఇచ్చారు. ఈ స్థలంలో ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆస్పత్రికి సోమవారం కుటుంబసభ్యులు చేతులు మీదుగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చావా భాస్కర్ రావు, ఫార్మా డైరెక్టర్ నాక్ హైదరాబాద్ డాక్టర్ వాసిరెడ్డి శివలింగప్రసాద్, పుతుంబాక పార్వతవర్ధని, మండల నాయకులు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పృద్వీరాజ్, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఐకేపీ, జేసీ సిబ్బంది పాల్గొన్నారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 7: సత్తుపల్లి నియోజకవర్గంలో అకాలంగా వచ్చిన వడగండ్ల వానాతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అకాల వర్షం రైతులకు కన్నీళ్లు మిగిల్చాయని, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. వర్షానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి వరి రైతులకు ఎకరాకు రూ.30 వేలు, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.40 వేలు, మామిడి రైతులకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 7: సత్తుపల్లి బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవ వేడుకలను జరిగాయి. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ, కాంప్లెక్స్ హెచ్ఎం పీ.యాకుబ్, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా శ్రీను



ఖమ్మం సిటీ, ఏప్రిల్ 7 : మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా దాసరి శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గం వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం నగరానికి చెందిన శ్రీను గత కొన్నేళ్లుగా దళిత ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తన సేవలను గుర్తించిన జాతీయ, రాష్ట్ర కార్యవర్గానికి శ్రీను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 13న భీమ్ దీక్ష ముగింపు సభ

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 7: ఈ నెల 13వ తేదీన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో జరిగే భీమ్‌దీక్ష ముగింపు సభను జయప్రదం చేయాలని స్వేరో నాయకుడు వీవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భీమ్ దీక్ష ముగింపు సభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఐలపొంగు వెంకన్న, చీమ భూపాల్, శ్రీను, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## వాణిజ్య పన్నుల యుద్ధంతో వ్యవసాయం నాశనం

వైరాటౌన్, ఏప్రిల్ 7: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న స్వీయ రక్షణ ప్రతికార పన్నుల విధానంతో మన వ్యవసాయం మరింత సంక్షోభంలోకి పోతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం వైరా మండలం గొల్లెనపాడు గ్రామంలో జరిగిన సీతారామయ్య వర్ధంతిలో ఆయన మాట్లాడారు. తోట నాగేశ్వరరావు, అమరనేని వెంకటేశ్వరరావు, వెంపటి రాజా, ఆళ్ల శ్రీనివాస్, చంద్ర ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కొణిదెన ధర్మారావు, రాజబాబు, అమరనేని సాంబశివరావు, అమరనేని అప్పారావు, కొణిదెన రవి, భవిత పాల్గొన్నారు.

## వ్యక్తుల జీవనశైలే వ్యాధులకు మూలం

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 7 : వ్యక్తుల జీవనశైలే అన్నిరకాల వ్యాధులకు మూలమని ప్రముఖ వైద్యుడు సీతయ్య అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లోని నడక సాధకులకు వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100మంది వాకర్స్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షల నిమిత్తం ఉచిత కూపన్లు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామనాథం, రాకం శ్యాంబాబు, విజయ్‌కుమార్, వెంకట్, సదా, పద్మ, రమాశేఖరం, రజనీ, సబిత, లలిత, మంగా, కిరణ్మయి పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల ఘర్షణ

### 13 మందిపై కేసులు నమోదు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 7: మండలంలోని జల్లేపల్లిలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం రాత్రి కాంగ్రెస్ బీఆర్ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జల్లేపల్లిలో సీతారాముల కల్యాణం అనంతరం రాత్రి సీతారామ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. కాంగ్రెస్‌కు చెందిన తురక వీరన్న, బీఆర్ఎస్‌కు చెందిన బాదరబోయిన గంగమ్మ ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇరువురి మధ్య ఘర్షణ

### తోపులాటలో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, ఏప్రిల్ 7 : మహిళతో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి వారిరువురి మధ్య తోపులాటలో మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతలపూడి గ్రామానికి చెందిన కాసాని రవిప్రసాద్(48) అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో సహజీవనం సాగిస్తూ కొంతకాలంగా ఖమ్మం నగరం గొల్లగూడెంలోని నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా ఆదివారం ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈక్రమంలో జరిగిన తోపులాటలో మహిళ గట్టిగా తోయడంతో రవిప్రసాద్ తల గోడకు తగిలి మృతిచెందాడు. రవిప్రసాద్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

## గడ్డికట్టే మిషన్‌లో పడి వ్యక్తికి తీవ్రగాయాలు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 7: ప్రమాదవశాత్తు వరిగడ్డి కట్టలు కట్టే యంత్రంలో పడి వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. ప్రత్యక్ష్య సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగళగూడెం గ్రామ శివారు కొత్తూరు గ్రామానికి చెందిన దేశమైన వీరన్న తన పంట పొలంలో యంత్రం సహాయంతో వరి గడ్డిని కట్టలు కడుతున్నాడు. ప్రమాదవశాత్తు అదే మిషన్‌లో పడడంతో వీరన్నకు తీవ్ర గాయలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు వీరన్నను యంత్రం నుంచి బయటకు తీసి ఖమ్మం వైద్యశాలకు తరలించారు. వీరన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

కూసుమంచి, ఏప్రిల్ 7 : కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చెందిన సోలీపురం వెంకటరెడ్డి(75) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. వెంకటరెడ్డికి స్థానికంగా మంచి రైతుగా పేరుంది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటరెడ్డికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్ ఖమ్మంలో నివాళులు అర్పించారు. వెంకటరెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితోపాటు పలువురు సంతాపం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు, ఏప్రిల్ 7: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. ఏపీలోని ఎన్టీఆర్‌నగర్ జిల్లా విసన్నపేట మండలం ములగలపాటివారిగూడెం గ్రామానికి చెందిన కంటె వెంకటనారాయణ(70) ద్విచక్ర వాహనంపై వస్తుండగా మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటనారాయణకు తీవ్రగాయాలు కావడంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతిచెందాడు.